నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 47 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | ఆగస్టు 15, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఉర్విజనులునిచ్చు ఉచిత సూచనలను
సాయమున్న జేయ సంశయించు
పరులసేవజేయ పరమాత్మ పూజయె
విజయ.....

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.




# రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి
- జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ,ఆగస్టు 14 :**భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందే శంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వా తంత్ర్య దినోత్సవ వేడుకలతో మిగతా2లో...

## ఫూలే విధానాలతో

# ముందుకెళ్తున్నాం

- 'ఫీజు' కోసం ఏటా రూ.2,400 కోట్లు
- దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే విద్యార్థుల ఖాతాల్లో జమ
- పిల్లలను కుల వృత్తులకే పరిమితం చేసేందుకు యత్నించిన బీఆర్ఎస్
- ఫూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 14 :** మహాత్మా జ్యోతిబా ఫూలే విధానాలతో తమ ప్రభుత్వం ముందుకెళుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం విద్యార్థులెవరూ ఇబ్బంది పడకుండా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ముందుగానే రూ.2,400 కోట్లను కేటాయించామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి నెల రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని భరోసానిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ సమీపంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో

మిగతా2లో...



# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

- భౌతికి కాయం వద్ద నివాళులు

హైదరాబాద్,ఆగస్టు 14 : అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని

మిగతా2లో...

## డిసెంబర్‌లో తెలంగాణ

# రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం






# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఆగస్టు 14: కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం మిగతా2లో...

## ఇకనుంచి

# స్మార్ట్ రేషన్ కార్డులు

- ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాటు
- నేడు సంగారెడ్డిలో సిఎం చేతుల మీదుగా విడుదల



**సంగారెడ్డి,ఆగస్టు 14:** ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారు తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. సంగారెడ్డిలో శనివారం పంద్రాగస్ట్ పురస్కరిం చుకుని సిఎం రేవంత్ రెడ్డి స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్డులు అందచేయనున్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. స్థాని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే లబ్దిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స్ కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతున్న లబ్దిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పంద్రా గస్టు రోజు నుంచి సరి కొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ముద్రణ పూర్తి చేసు కున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్దిదా రులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫ రాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో దారిద్య రేఖకు మిగతా2లో...

# రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

- సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత




# సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ




## నిరసన తెలిపే హక్కు

# విద్యార్థులకు ఉంది

నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644




# పూలే విధానాలతో ముందుకెళ్తున్నాం


(మొదటి పేజీ తరువాయి)


ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పిల్లలను ఆయా కులవృత్తులకే పరిమితం చేసేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అందుకు భిన్నంగా ఆయా వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదివేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. అంటరానితనం, ఆకలికేకలు, మూఢ నమ్మకాలు, మహిళకు చదువు అనేది ఊహకందని కాలంలోనే పూలే చదువుకోవట మేగాక, తన సతీమణిని కూడా చదివించారని సీఎం గుర్తు చేశారు. చదువు విలువ తెలిసిన పూలే దంపతులు భవిష్యత్తును ముందుగానే ఊహించి, చిరస్మరణీయులయ్యారని కొనియాడారు. కుల నిర్మూలనకు సామాజిక చైతన్యం అవసరమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కులాల పిల్లలు వేర్వేరుగా కుండా ఒకే దగ్గర చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూపకల్పన చేయబోతోందని తెలిపారు. చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అలాంటి వారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాల్లో అవకాశాలను ఇప్పించే బాధ్యత తమదని ప్రకటించారు. క్రీడల్లో రాణించే వారికి నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపిస్తున్నదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణా యేనని చెప్పారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం కులగణన చేసిన తర్వాత మళ్లీ కులగణన చేసిన ప్రభుత్వం కూడా తమదేనని వివరించారు. శాస్త్రీయ సర్వేతో బలహీనవర్గాల లెక్కలు తేల్చి కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరామని అన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, కోర్టుల ద్వారా ఆపాలని ప్రయత్నించినా, అసెంబ్లీలో ఆటంకాలు సృష్టించినా తాము వెనుకడుగు వేయలేద న్నారు.గొప్పలు చెప్పుకునే మోడీ గుజరాత్ లో వర్గీ కరణను అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో జనగణనతో పాటు కుల సర్వే చేయడాన్ని తాము తప్పనిసరి చేశామన్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా పాటిస్తున్నట్టు తెలిపా రు. 'చదువు తలరాతను మారుస్తుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. దేశ ప్రతిష్టను ప్రపం చంలో పెంచుతుంది. పూలే చెప్పిందిదే. నాణ్యమైన విద్యనందించే బాధ్యత నాదే. తల్లిదండ్రు లకు భారం కానివ్వకుండా విద్యార్థులు చదివినంత మేరకు చదివిం చేందుకు తాము సిద్ధంగా ఉన్నాం...' అని సీఎం హామీ ఇచ్చారు. ఈ సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు విహెచ్, కేకే, టీపీసీసీ అధ్యక్షు లు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

**హైదరాబాద్,ఆగస్టు 14:** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమా వేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయా లు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగా ణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ (ఏబీబబితిఇ। ÷ాబీసాజీ ఐజీనిబి)ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (÷ాఅఃం) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. 'ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷-లెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.



# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు


(మొదటి పేజీ తరువాయి)


ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

**• పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు**



**హైదరాబాద్,ఆగస్టు 14 :** తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి.ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

# రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి


(మొదటి పేజీ తరువాయి)


యవాత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోక్‌సభ్‌లో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

**- సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత**

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసును సుప్రీంకొట్టివేసింది. ఈ కేసులో అంతకుముందు లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను కూడా కోర్టు రద్దు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షిల్ నాగుతో కూడిన ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణకు అవసరమైన అనుమతిని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందలేదని, అందువల్ల ఇది విచారణార్హం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీంతో రాహుల్‌పై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై తమ అనుమతి తీసుకున్నట్టు ఎలాంటి ఆధారాలు తమ వద్ద లేదని చెబుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022, నవంబర్ 17న మహారాష్ట్రలోని అకోలాలో పర్యటిస్తుండగా రాహుల్ గాంధీ.. సావర్కర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు.అయితే, రాహుల్ ఉద్దేశపూర్వకంగా సావర్కర్ గౌరవాన్ని తగ్గించే లక్ష్యంతోనే ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయన పరువుకు భంగం కలిగించారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే లాయర్.. రాహుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో కోర్టు దీనిపై విచారణ జరిపి, రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు.స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనికి యూపీ ప్రభుత్వం బదులిస్తూ ఒక అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసులో రాహుల్ గాంధీపై 153 ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదైందని, దీనిపై విచారణ జరిపేందుకు అవసరమైన అనుమతుల్ని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీసుకోలేదని సుప్రీంకోర్టు గుర్తించింది. యూపీ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఈ వివరణ ఉంది. దీంతో రాహుల్ గాంధీపై నమోదైన పిటిషన్‌పై విచారణకు అర్హత లేదని భావిస్తూ.. సుప్రీంకోర్టు ఈ కేసును కొట్టివేసింది. ఇదే సమయంలో.. స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన అంశాల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని రాహుల్‌కు సూచించింది.

# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం


(మొదటి పేజీ తరువాయి)


శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు.

ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.

# సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

**హైదరాబాద్,ఆగస్టు 14:** తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్టార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు


(మొదటి పేజీ తరువాయి)


దిగువ ఉన్నవారికి తెలుపు రంగు కార్డులు, ఎగువనున్నవారికి గులాబీ రంగు కార్డులు ఉండేవి. గులాబీ రంగు కార్డుదారులకు బియ్యం మినహా ఇతర సరుకులు పంపిణీ చేసేవారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీకి పరిమితం కావడంతో గత ప్రభుత్వం గులాబీ కార్డులను రద్దు చేసింది.ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని విధంగా ఏటీఎం, పాన్‌కార్డు మాదిరిగా డిజిటలైజేషన్, స్మార్ట్ టెక్నాలజీ ఆధారితంగా పంపిణీ చేసే పీవీసీ కార్డు, చిప్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి టెక్నాల జీతో స్మార్ట్ రేషన్‌కార్డులు ముద్రించారు. కార్డు స్కాన్ చేయడంతో అందులో ఉన్న కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం వస్తుంది. ఆధునిక భద్రతా ఫీచ ర్లను పొందుపరచి స్మార్ట్ కార్డులు లబ్దిదారులను ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం రోజు నుంచి లబ్దిదా రులకు చేరనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే రేషన్ సరుకులు బయోమెట్రిక్ ద్వారా రేషన్ దుకాణాల్లో ఎక్కడైనా సరుకులు పొందే అవకాశం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో లబ్దిదా రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. స్మార్ట్ కార్డు ద్వారా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనై నా సరుకులు పొందడానికి సులువుగా మారు తుంది. క్యూఆర్ కోడ్ ఉండడంతో కార్డులు డూప్లికేట్ కాకుండా ఉంటుంది. జిల్లాల్లో ప్రస్తుతం రేషన్‌కార్డు కలిగిన లబ్దిదారులందరికీ స్మార్ట్ కార్డులను రేషన్ షాప్‌లో పాత కార్డు చూపించి స్మార్ట్ కార్డును పొందవచ్చు. అంతే కాకుండా టీఎస్‌ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కూడా స్మార్ట్ కార్డు తీసుకునే వీలు కల్పిస్తున్నారు. కొత్తగా అందించే స్మార్ట్ రేషన్ కార్డులు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ముద్రిస్తారు. కార్డు వెనకవైపు కుటుంబ సభ్యుల వివరాల తో పాటు ఇతర అవసరమైన సమాచారాన్ని పొందుపరిచారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ కె, సత్తెనపల్లి, కొత్తవాడ సూర్జాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ చేశారు. బావాపూర్ కె పాఠశాలలో సర్పంచ్ మైస రాజేష్, సత్తెనపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జాడ భీమలింగం, కొత్తవాడ సూర్జాపూర్ పాఠశాలలో వార్డు సభ్యుడు గంగాధర్ విద్యార్థులకు షూస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలతో పాటు ఈ ఏడాది షూస్ కూడా అందజేసిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం పర్వదినాన లలితా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రావణ శుక్రవారం సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని శ్రీ లలితా పరమేశ్వరి--శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రధాన పూజారి నితీష్ పంతులు అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రతి రోజు, ముఖ్యంగా సోమ, శుక్ర, శనివారాల్లో భక్తులు ఆలయాల్లో దేవుళ్లను దర్శించుకోవాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తే కోరుకున్న పనులు సఫలమవుతాయని పేర్కొన్నారు.

## కోతుల బెడద నివారణకు చర్యలు ప్రారంభం



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ పట్టణంలోని 7వ వార్డులో శుక్రవారం కోతులను పట్టించినట్లు కౌన్సిలర్ నిమ్మల రమేష్ తెలిపారు. గత కొంతకాలంగా పట్టణంలో కోతుల బెడద పెరిగి ఒకరు మరణించగా, పలువురు గాయాలపాలయ్యారని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో కోతుల సమస్యపై తీర్మానం చేసి, పట్టివేత చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం 7వ వార్డులో ప్రత్యేక బృందంతో కోతులను పట్టించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్, బిజెపి నాయకులు అంకం మహేందర్, కౌన్సిలర్ నిమ్మల రమేష్, ఆత్మ చైర్మన్ తోట సత్యం, జమాల్, కాంగ్రెస్ నాయకులు గొర్రె గంగాధర్, రాము, లక్ష్మణ్, రామ్ భీమన్న, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కొత్త దుస్తులను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పట్టణంలోని 12 వార్డుల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమై ప్రజలకు అందుబాటులో ఉండి అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చిరు సహాయంగా దుస్తులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు బొప్పారపు సత్యవతి, తొడసాం ఇందిరా, కమిషనర్ సుందర్ సింగ్, నాయకులు ప్రకాష్ గౌడ్, మేష సతీష్, బొప్పరపు రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బంగారు పోచమ్మ తల్లి బోనాలు



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ రూరల్ మండలంలోని 4వ డివిజన్ దుర్షేడ్‌లో శ్రీ బంగారు పోచమ్మ తల్లి అమ్మవారి బోనాలు, మహిళల సారే సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్, 4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్, 5వ డివిజన్ కార్పొరేటర్ గాదే రూప శ్రీనివాస్, ఆలయ చైర్మన్ కోరుకంటి వేణుమాధవ్ పాల్గొన్నారు. భక్తులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



**గంగాధర, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేశారు. సర్పంచ్ వేముల భాస్కర్, ప్రిన్సిపాల్ సత్యనారంజనేయ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒక్కో విద్యార్థికి 12 నోట్‌బుక్స్‌తో పాటు పాఠ్యపుస్తకాలు అంద జేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాం క్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన సిపిఐ ప్రచార జాత

**గంగాధర, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతా విజయవంతంగా ముగిసింది. జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విద్య, వైద్యాన్ని పేదలకు అందనంత దూరం చేస్తోందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసగిస్తోందని, కార్మిక హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాల కారణంగా దేశవ్యాప్తంగా రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించిందని, చివరకు ప్రధాని క్షమాపణ చెప్పాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం కోసం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని, డీలిమిటేషన్‌లో వివక్షత పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను పరీక్షల లీకేజీలతో ఇబ్బందులకు గురి చేయడం సిగ్గుచేటని అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సెప్టెంబర్ 1న ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన జరగనుందని, బీజేపీ ప్రభుత్వ విధానాలపై మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతాలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కోఆర్డినేటర్లు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, నాగెల్లి లక్ష్మారెడ్డి, మహిళా సమాఖ్య నాయకులు బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఏఐవైఎఫ్ నాయకులు యుగేందర్, సిపిఐ మండల నాయకులు వేముల మల్లేశం, కనకయ్య, బాకం ఆంజనేయులు, బీర్ల స్వాతి, స్వప్న, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




# ఉత్సాహంగా భాజపా శ్రేణుల జెండా పండుగ

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా యాచారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష మాట్లాడుతూ, "జాతీయ నాయకుల త్యాగస్ఫూర్తిని నేటితరానికి గుర్తుచేస్తూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ ర్యాలీని బీజేపీ అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపెల్లి అంజయ్య హాజరై జాతీయ జెండాలు పట్టుకుని విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బాబు జగ్జీవన్ రావు, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, "దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలు చిరస్మరణీయాలు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేసి దేశ ఐక్యతను చాటాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా సహకోశాధికారి తాండ్ర రవీందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు నాగని యాదయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు గోగికర్ రమేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు అంబోజి జగదీష్, మొండి గౌరెల్లి సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి, చింతుల్ల సర్పంచ్ అంబోజి రమేష్, తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, బీజేవైఎం ప్రతినిధి వనవాడ రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు పల్లపు నరేష్, కడారి జంగయ్య, బొడ్డు భాషయ్య, ఉపసర్పంచులు గౌర లక్ష్మణ్, గౌర నాగరాజు, రవీందర్, బీజేపీ నాయకులు నాయిని పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సంతోష్ గుప్తా, నారిమల రమేష్, పత్తి రాజు, సాటు మల్లేష్, రాజ మోర్చా సభ్యులు పెరుమాళ్ళ విక్రమ్, పల్లపు రవీందర్, శ్రీకాంత్ రెడ్డి, బన్నె శివ, బూర సందీప్, కానుగుల కృష్ణతో పాటు వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



# 765 కేవీ లైన్‌తో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

**– పరిహారం కోసం ఎమ్మెల్యే కసిరెడ్డికి రైతుల వినతి**

**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ పట్టణం మీదుగా వెళ్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కారణంగా భూములు, పంటలు నష్టపోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించాలని కోరుతూ రైతులు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సర్పంచ్ బిక్షపతి, ఉప సర్పంచ్ యాదగిరిరెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు రైతుల సమస్యలను వివరించారు. హైటెన్షన్ లైన్ ఏర్పాటు వల్ల భూములు, పంటలకు జరుగుతున్న నష్టాన్ని వివరించి, బాధిత రైతులకు నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారం విషయంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. లైన్ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన, పంటలకు నష్టం వాటిల్లిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన న్యాయమైన పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం

**– మార్కెట్ యార్డులో జాతీయ పతాక ఆవిష్కరణ.. ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి**

**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో శనివారం ఉదయం 8.30 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమానికి పట్టణ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పాత్రికేయులు, యువతీ యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, జాతీయ ఐక్యత, సమగ్రతను చాటేలా ప్రతి ఒక్కరూ వేడుకల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణ ప్రజలు అన్ని వర్గాలుగా తరలివచ్చి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని యాట గీత నర్సింహ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.



# ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలపై కొరడా

**– ఆమన్‌గల్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు.. వ్యాపార సంస్థలకు రూ.10 వేల వరకు జరిమానాలు**

**ఆమన్‌గల్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమన్‌గల్ పట్టణంలో పారిశుధ్యం, ప్రజారోగ్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి శుక్రవారం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ధాబాలు, చికెన్ సెంటర్లు, ఆటోమొబైల్ షోరూమ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత, ఆహార హైజీన్ ప్రమాణాలు, ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన, లైసెన్స్‌లు లేని వ్యాపార సంస్థలపై రూ.10 వేల వరకు జరిమానాలు విధించారు. నిబంధనలు పాటించకపోతే మరింత అధిక జరిమానాలతో పాటు అవసరమైతే సంస్థలను సీజ్ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

అనంతరం పోలీసు, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి బస్‌స్టాండ్, హైదరాబాద్--కల్వకుర్తి ప్రధాన రహదారిని పరిశీలించారు. ఫుట్‌పాత్‌లు, రహదారి మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులను గుర్తించి ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజా రహదారులు, ఫుట్‌పాత్‌లు, మున్సిపల్ స్థలాల్లో ఆక్రమణలను సహించబోమని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఇన్‌చార్జి మేనేజర్ అంజనేయులు, మున్సిపల్ సిబ్బంది రాజశేఖర్, రమేష్, రామకృష్ణ, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



# సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు

**– రాంనుంతల రైతు వేదికలో ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు అవగాహన**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాంనుంతల రైతు వేదికలో ఆత్మా పథకం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సేంద్రియ వ్యవసాయంపై శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మూర్తుజపల్లి గ్రామానికి చెందిన సేంద్రియ రైతు సాయిరెడ్డి సేంద్రియ వ్యవసాయం ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. రసాయనిక మందులు, ఎరువులకు బదులుగా జీవామృతం, ఘనజీవామృతం వంటి సహజ పద్ధతులను వినియోగించడం ద్వారా భూసారాన్ని కాపాడుతూ నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ సాగుతో భూసారం పరిరక్షణతో పాటు పంటల నాణ్యత, దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. రైతులు అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకుని తక్కువ ఖర్చుతో సాగు చేపట్టే విధానాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. రాంనుంతల సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తికి సహజ సాగు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మీనాక్షి, కోనాపూర్, రాంనుంతల గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానంతో ప్రాణదానం

**– లయన్స్ ఆధ్వర్యంలో శిబిరం.. 40 మంది స్వచ్ఛంద రక్తదానం**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు తలకొండపల్లిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శతాబ్ది సిల్వర్ స్ప్రింగ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఈ శిబిరాన్ని లయన్ కాసు శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి కాసు సీతమ్మ జ్ఞాపకార్థం లయన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శిబిరంలో యువత, లయన్స్ సభ్యులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని 40 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు పీఆర్వో లయన్ పాషా తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజా సేవలో భాగంగా లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న రక్తదాన, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా లయన్ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీతమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరం ద్వారా ఆమె స్మృతిని సేవా కార్యక్రమంతో కొనసాగించడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో లయన్ జంగయ్య, కొత్తపేట డీసీసీబీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, లయన్స్ సభ్యులు, యువత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# డ్రోన్ మందు పిచికారీతో పత్తి పంటకు నష్టం.. రైతుకు భరోసా



**ఆమనగల్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామానికి చెందిన రైతు వసంత రవి సాగు చేసిన పత్తి పంటను శుక్రవారం ఆమనగల్ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేశారు. సుమారు పది రోజుల క్రితం సమీపంలోని జొన్న పంటకు డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీ చేయగా, గాలి ద్వారా ఆ మందు పక్కనే ఉన్న వసంత రవి పత్తి పొలంపై పడటంతో సుమారు నాలుగు ఎకరాల పత్తి పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా రైతును పరామర్శించిన అధికారులు పంట నష్టంపై వివరాలు సేకరించి, రైతుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమనగల్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పత్తి విత్తనాలు, అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తామని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. డ్రోన్ ద్వారా పురుగుమందులు, కలుపు మందులు పిచికారీ చేసే సమయంలో గాలి దిశను గమనించి, చుట్టుపక్కల పంటలకు నష్టం కలగకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దావ ధనుంజయ్య, కమతం బాలకిష్టయ్య, దావ జంగయ్య, బంగరి గల్లా రామలింగయ్య, సాటు పవన్, లోడిగా శివ తదితర రైతులు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ఆసుపత్రి నిర్మాణానికి స్థల సమస్య పరిష్కరించాలి

**– పాలశీతలీకరణ కేంద్రానికి ప్రత్యామ్నాయ భూమి కేటాయించి ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి విజయ పాలశీతలీకరణ కేంద్రం స్థలాన్ని కేటాయించాలని మాజీ సర్పంచ్ లక్ష్మీనరసి ం హారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత పాలకవర్గ హయాంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో ఆసుపత్రి ఏర్పాటుకు రూ.1.43 కోట్లు మంజూరైనా, అనువైన స్థలం లేక పనులు ముందుకు సాగలేదన్నారు. విజయ పాలశీతలీకరణ కేంద్రం ఆధీనంలోని సుమారు 3 ఎకరాల 10 గుంటల స్థలాన్ని ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించి, కేంద్రానికి ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమి ఇవ్వాలని కోరారు. పాలశీతలీకరణ కేంద్రం వ్యర్థాలతో సమీపంలోని ఉపరాశి కుంట కలుషితమవుతోందని, దుర్వాసనతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు, గత పాలకవర్గం గడువు ముగియడంతో ప్రతిపాదన ముందుకు సాగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని లక్ష్మీనరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



**తలకొండపల్లి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన యూనిఫామ్‌లు, టైలు, బెల్టులు, షూలను గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నసీమా సుల్తానాతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ జి. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, “ప్రజా ప్రభుత్వంలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన దుస్తులు అందించడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం లక్ష్యం” అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి. వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ సీఎల్. శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ముజీబూర్ రహమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, వార్డు సభ్యులు విశేఖర్ నాయకులు ఏ. వెంకట్ రెడ్డి, ఎస్. విజయ్ కుమార్, ఆరిఫ్, వి. వెంకటేష్, సి.హెచ్. విష్ణువర్ధన్ యాదవ్, వద్దే రాజు, దుబ్బ గణేష్, ఉపాధ్యాయులు, ఏపీఎం రామస్వామి, సీసీ శ్రీశైలం, మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య, బుక్ కీపర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్‌లో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ తెలిపారు -- ఆగస్టు 15న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత ్మకంగా చేపట్టిన ఈ కార్య్ర కమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనుండగా, నాగర్‌కర్నూల్‌లోని కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిం చనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుల చేతుల మీదుగా లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులు అందజ ేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభి ంచను ండగా, దానికి అనుసంధానంగా జిలా ్లలోనూ పంపిణీ జరగనుంది. కలెక్టర్ మాట్లాడుతూ, “ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా డిజిటల్ విధానాన్ని మరింత పటిష్టం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా పారదర్శకంగా, సులభతరంగా రేషన్ సదుపాయాలు అందించడంతో పాటు లబ్ధిదారుల వివరాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చు” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు -- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయని కలెక్టర్ వెల్లడించారు.

## గాయత్రి జూనియర్ కళాశాలలో ఘనంగా స్వాగతోత్సవం




**పెద్దపల్లి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు రంగంపల్లిలోని గోల్డెన్ తులిప్ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. కరస్పాండెంట్ రజనీ దేవి విద్యార్థులను ఉత్సాహపరుస్తూ పట్టుదలతో ప్రయాణం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా నృత్య ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఆగస్టు 15’ ఆకృతిలో నరేంద్ర విద్యాలయ విద్యార్థుల సందడి



**గంగాధర, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలోని నరేంద్ర విద్యాలయం హై స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 15 ఆగస్టు ఆకృతిలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు జాతీయ జెండాతో క్రమశిక్షణ పద్ధతిలో నిలిచి దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులను గుర్తుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం గంగాధర రాజేశం, గుత్తుల గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

## ఆరో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



**గంగాధర, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో ఆరో రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. గ్రామస్తులు కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించి తలనీలాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మనసు మారి గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్లిం సోదరుడు ఎం.డి. ఫరూక్, నవీన్, జాడ రాజయ్య, కొమురయ్యతో పాటు గ్రామ ప్రజలు స్వామివారిని ప్రార్థిస్తూ ముంపు గ్రామంగా ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.

## ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ 6వ డివిజన్ గుంటుపల్లిలో ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ మేకల వెంకటేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి స్టేజి వద్ద బోర్డు ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చిందం అశోక్, సాయవేణి సదానందం, అసిరి తిరుపతి, రామచంద్రం, పుట్టపాక శ్రీధర్, పెద్ది లక్ష్మణ్, ముతిక మల్లేష్, కాల్వ శ్రీకాంత్, చింటూ, రాజు, జోజీ రెడ్డి, సుధాకర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రావణ శోభతో అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో పండుగ సందడి



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శ్రావణ శోభ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శ్రీ గౌరీ మాతకు పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రావణ మాసం అత్యంత పవిత్రమైనదని, ఈ కాలంలో దానధర్మాలు చేసి పుణ్యఫలాలు పొందవచ్చని, శ్రీవరలక్ష్మి వ్రతం, నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యంగా నృత్య ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రాంగణం పూలతో అలంకరించి పండుగ శోభను రెట్టింపు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలు, సామాజిక సేవకు డా. పొలు శంకర్‌కు అంతర్జాతీయ పురస్కారం



**హుస్నాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన డా. పొలు శంకర్ సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడారంగంలో చేసిన విశేష కృషికి ప్రతిష్ఠాత్మక “ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026” పురస్కారం లభించింది .హైదరాబాద్ కింగ్‌కోటిలోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సం దర్భంగా సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో ఆయనకు “బెస్ట్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అచీవర్స్ అవార్డు”తో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. క్రీడలు, సేవా కార్యక్రమాల ద్వారా యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించేందుకు కృషి చేస్తున్న డా. పొలు శంకర్ తన కృషిని గుర్తించి అవార్డు అందించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరింతగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. డా. పొలు శంకర్‌కు అంతర్జాతీయ స్థాయి పురస్కారం లభించడంపై తోటపల్లి గ్రామస్థులు, క్రీడాకారులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీ సమీక్షా మానసిక వికలాంగుల పాఠశాల ప్రారంభం



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మెరుగైన విద్య, శిక్షణ, పునరావాస సేవలు అందించాలనే లక్ష్యంతో కరీంనగర్‌లో శ్రీ సమీక్షా మానసిక వికలాంగుల పాఠశాలను ఘనంగా ప్రారంభించారు. మేయర్ కొలగని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, తోట అనిల్, ఆకుల నందిని--ఉదయ్, సాదవేని సుజాత--శ్రీనివాస్, చొప్పరి జయశ్రీ--వేణు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ రఘురామ్ ప్రత్యేక పిల్లల ఆరోగ్యం, వైద్య అవసరాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రతినిధి జ్యోతి మాట్లాడుతూ, విద్యతో పాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ప్రత్యేక విద్య, దైనందిన జీవన నైపుణ్యాల శిక్షణ అందించడమే లక్ష్యమని తెలిపారు. ప్రత్యేక పిల్లల తల్లిదండ్రులు అందుబాటులో ఉన్న సేవ లను వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రారంభోత్సవంలో సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మస్కాపూర్ రహదారిపై బైక్ ప్రమాదం ఇద్దరికి గాయాలు

**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మస్కాపూర్ గ్రామ రహదారిలో ఇడ్లీ థియేటర్ సమీపంలో శుక్రవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో సుర్జాపూర్‌కు చెందిన రామకృష్ణ, ఖానాపూర్ సుభాష్ నగర్‌కు చెందిన చిన్నయ్య గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## బైక్‌ను ఢీకొన్న కారు ఇద్దరికి స్వల్ప గాయాలు



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బాదం కుర్తి శివారులో మల్లాపూర్ పోలీస్ పరిధిలో కారు--బైక్ ఢీకొని చెట్టుకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీరాంపూర్‌కు చెందిన చెరుకుచిన్నారెడ్డి, బాదం కుర్తి చెందిన కమ్మరి దత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మల్లాపూర్ పోలీసులు కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## యువభారత్ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమం



**హుస్నాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్కన్నపేట మండలం గౌరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేరా యువభారత్--సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్షవాడ కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్ విద్యార్థులకు స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించి, పరిశుభ్రమైన భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయా లని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యానికి, సమాజ అభివృద్ధికి కీలకమని, విద్యార్థులు పరిశుభ్రత కోసం ముందడుగు వేయాలని సూచిం చారు. కార్యక్రమంలో యువజన సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ప్రధానోపాధ్యాయురాలు ఏ. జ్యోతిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జంగాపల్లి వెంకట నరసయ్య, రామన్ బాబు, శ్రీనివాస్, కృష్ణకుమారి, నాశ్రీన్, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరాధార ఫిర్యాదులు ఉపేక్షించం కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. రాఘవపూర్‌కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ ఏల్లమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు లేవంటూ లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయం విచారణలో నిరాధారమని తేలింది. ఈ ఫిర్యాదు ద్వారా అధికారుల సమయాన్ని వృథా చేసినందుకు లోకాయుక్త రూ.10 వేల జరిమానా విధించింది. కలెక్టర్ తెలిపారు, జరిమానాను రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేయనున్నట్లు. ప్రజా సమస్యలపై వాస్తవా ధారాలతో ఫిర్యాదులు చేయడాన్ని ప్రభుత్వం స్వాగతిస్తుందని, కానీ తప్పుడు ఆరోపణలు చేసి అధికారులను అప్రతిష్ఠపాలు చేయాలనే ప్రయత్నాలను ఉపేక్షించబోమని హెచ్చరిం చారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మున్సిపల్ మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా గ్లోరినా నియామకం



**హుస్నాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ మున్సిపల్ మైనారిటీ కోఆప్షన్ (క్రిస్టియన్) సభ్యురాలిగా కాతా అలియాస్ మారుపాక గ్లోరినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో 14 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిషనర్ మల్లిఖార్జున్ ప్రకటించారు. గతంలో వాయిదా పడిన ఎన్నికను ఈసారి కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో పూర్తి చేశారు. గ్లోరినా మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ, మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చైర్పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు చెన్నబోయిన, అనూష, బురుగు లత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్య సంపత్, గడిపె సతీష్ కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు భూక్య సరోజన, మహమ్మద్ హసన్, అధికారులు పాల్గొన్నారు.

## చట్టబద్ధ దత్తతపై అవగాహన కల్పించిన జిల్లా సంక్షేమ అధికారి



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ శిశుగృహలోని నాలుగు నెలల బాబును పెద్దపల్లి గోదావరిఖనికి చెందిన దంపతులకు జిల్లా సంక్షేమ అధికారి యం. సరస్వతి చే దత్తత అందించారు. ఈ సందర్భంగా పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలోనే దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి సమాచారం కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, జిల్లా పరిషత్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు కళింగ శేఖర్, బి. రాధ, డిసిపిఓ పర్వీన్, శిశుగృహ ఇంచార్జి అపూర్వ, సూపరింటెండెంట్ నర్మద, జిల్లా సిడిపిఓలు కవిత, శ్రీలత, సుగుణ, నర్సింగరాణి, జె. తిరుపతి, సంపత్, మునిగంటి రాజ్‌కుమార్, సాదినేని రమేష్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## కిమ్స్ కాలేజీలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కిమ్స్ కాలేజీలో పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన ప్రభుత్వ శాఖలతో పాటు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఈగల్ టీం డీఎస్పీ ఉపేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, కిమ్స్ కాలేజ్ వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, మిషన్ వాత్సల్య సిబ్బంది సాదినేని రమేష్, స్వప్న, త్రీ టౌన్ సీఐ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో బాల భారతి ఎన్నికలు విజయవంతం



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో 2026--27 విద్యా సంవత్సరానికి బాల భారతి ఎన్నికలు క్రమశిక్షణతో విజయవంతంగా పూర్తయ్యాయి. మొత్తం 503 మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. హెడ్ బాయ్‌గా కొమ్ము మహేష్ 115 ఓట్లు సాధించి విజయం సాధించగా, సకినాల విశాల్ కుమార్ 110 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కేవలం 5 ఓట్ల తేడాతో పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. హెడ్ గర్ల్‌గా మంచికట్ల వెన్నెల 132 ఓట్లు సాధించి ఘన విజయం సాధించగా, గుండేటి వంగ్మయి ప్రసన్న 86 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్పృహ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. విజేతలను ప్రధానాచార్యులు మోర రణధీర్ అభినందించారు. మాక్ పోలింగ్ కార్యక్రమంలో కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగం దుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, డా. ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చక్ర సహిత వాసవి కన్యకాపరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు



**నందికొట్కూరు (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరులో వెలసిన శ్రీ చక్ర సహిత వాసవి కన్యకాపరమేశ్వరి దేవికి ఆవాపా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో, పంచద్రవ్యములతో కుంకుమార్చన చేసి మహా మంగళహారతి అనంతరం అమ్మవారిని మల్లెపూలతో విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో బీమిశెట్టి జయ్యారామ, కృష్ణ, వి.బి.ఎన్. నాగసత్యనారాయణ, బి. శ్రీనివాసులు, వి.ఆర్. శ్రీనివాసులు, కలికి శ్రీనివాసులు, మలే రాజేష్, బలుస రాజు, మురారి ప్రవీణ్, సర్విశెట్టి పార్థసారథి, ఆర్య వైశ్య సంఘం, ఆవోపా, ఆర్యవైశ్య మిత్ర సంఘ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్త గ్రామపంచాయతీ కార్మికుల రిలే దీక్షకు సిఐటియు పిలుపు



**జమ్మికుంట, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆగస్టు 19న రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు రిలే నిరాహార దీక్షలో పాల్గొననున్నట్లు జమ్మికుంట మండల ఎంపీడీవోకు నోటీసు అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆన్లైన్లో పేర్లు నమోదు లేని కార్మికుల వివరాలు వెంటనే నమోదు చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా జీతాలు జమ చేయాలని, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.30 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 19వ తేదీన దీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాగర్ల కుమార్, ఏండిగా రవీందర్‌రావు, మేక మల్ల రాము, ఈర్ల నాగరాజు, అశోకు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**నందికొట్కూరు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నందికొట్కూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. నంద్యాల ఎంపీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డా. బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతతో కలిసి జాతీయ జెండాలను చేతబూని ర్యాలీ నిర్వహించారు. నంద్యాల రోడ్డులో నుంచి పటేల్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీ దేశభక్తి నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువత తమ భవిష్యత్తుతో పాటు దేశభక్తిని సంకల్పంగా భావించి, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. అనంతరం పట్టణంలో ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేలాదిమందితో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ




**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కరీంనగర్ నగరంలో 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి రామ్‌నగర్ వరకు సాగిన ఈ ర్యాలీలో వేలాది మంది కళాశాల విద్యార్థులు, యువకులు, మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ నగర వీధులు దేశభక్తి ఉత్సాహంతో మార్మోగాయి. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మేయర్ కొలగని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహణ



**గడివేముల, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గడివేముల మండలం గని గ్రామంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే చరితా రెడ్డి ఆదేశాల మేరకు వంగాల మురళి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం, స్త్రీ శక్తి, ఆటో డ్రైవర్ల సేవలో వంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు హర్షవర్ధన్, రామకృష్ణ, శేఖర్, బూత్ ఇంచార్జ్‌లు నాయుడు, మనోహర్, దొరస్వామి, ఏకాంతు, ఐటీడీపీ అధ్యక్షుడు విజయ్, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.






RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
శనివారం,
ఆగస్టు 15, 2026



## సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



**సుల్తానాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మండలంలోని మంచరామి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి విజ్ఞప్తి మేరకు రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల పనులు చేపట్టారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు సంతోషం వ్యక్తం చేసి, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ ఉప్పు లక్ష్మిని అభినందించారు.

## రోడ్డు గుంతల మరమ్మత్తులు



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కట్టారాంపూర్ నుండి కోతి రాంపూర్ వెళ్లే రోడ్డుపై గుంతలను మట్టి పోసి బ్లేడు ట్రాక్టర్‌తో చదును చేసే పనులను పదవ డివిజన్ కార్పొరేటర్ సౌగాని కొమరయ్య చేపట్టారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డుకు తక్షణమే మరమ్మత్తులు చేయడం ద్వారా ప్రజలకు సౌకర్యం కల్పించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## మిషన్ భగీరథ తాగునీరుపై గ్రామ సభ నిర్వహణ

**రామడుగు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రామడుగు మండలంలోని కొరటపల్లి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమవుతోందని గ్రామ ప్రజలు సర్పంచ్ మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు.సర్పంచ్ స్వయంగా నీటి ట్యాంకును పరిశీలించి, అనంతరం గ్రామ సభ నిర్వహించారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు నీటి నమూనాలను సేకరించి నాణ్యతను పరీక్షించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.గ్రామ సభలో ప్రజలు మిషన్ భగీరథ నీటిని వినియోగించుకోవాలని తీర్మానం చేశారు. సర్పంచ్ మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ లేకుండా నాణ్యమైన తాగునీరు నిరంతరం సరఫరా చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ ప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్లు, పంచాయతీ సభ్యులు, కార్యదర్శి, గ్రామ మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## శిథిలాలు పడి ఇల్లు ధ్వంసం.. పరిహారం చెల్లించాలని బాధితుల డిమాండ్

**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అంబేద్కర్ నగర్‌లోని ఓల్గా చిల్డ్రన్స్ హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పక్కనే ఉన్న రేకుల ఇల్లు ధ్వంసమై దాదాపు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగింది.మంగళవారం ఉదయం ఆసుపత్రి భవనాన్ని కూల్చివేసే సమయంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో భారీ గోడలు, శిథిలాలు కవిత--వేణు కుటుంబానికి చెందిన ఇంటిపై పడి తీవ్ర నష్టం కలిగించాయి.ప్రమాదం జరిగినప్పటికీ బాధితులను పరామర్శించకపోవడం, బాధ్యత తీసుకోకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శించారు. బాధితులు తమకు జరిగిన రూ.15 లక్షల నష్టాన్ని తక్షణమే పరిహారంగా చెల్లించాలని, హాస్పిటల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గీతన్నల చైతన్య యాత్ర విజయవంతం చేయాలి తిరుపతి గౌడ్



**హుస్నాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న 'గీతన్నల చైతన్య యాత్ర'ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ నుంచి చిగురుమామిడి మీదుగా సర్వేపేట వరకు బస్సు యాత్ర కొనసాగనుంది. యాత్రలో భాగంగా సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.ప్రతి పారిశ్రామిక సహకార సంఘానికి ఐదు ఎకరాల భూమి కేటాయించి తాటి, ఈత వనాలను పెంచాలని, ప్రమాదవశాత్తు మృతి చెందిన లేదా వికలాంగులైన కార్మికుల కుటుంబాలకు పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఆధునిక మోటారు పరికరాలు అందించి ప్రమాద రహితంగా కల్లు గీయే సౌకర్యం కల్పించాలని, అర్హులైన ప్రతి కార్మికుడికి వయోపరిమితి లేకుండా పింఛన్ ఇవ్వాలని కోరారు. యాత్ర విజయవంతం చేయడానికి గీత కార్మికులు, గౌడ బంధువులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి సంజయ్ జాజు



**సిద్దిపేట, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రైతులను పంట మార్పిడి వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని, కూరగాయల సాగును ప్రోత్సహించి మార్కెట్‌లో మంచి ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి జిల్లాలో అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేసి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఆగస్టు 17 నుంచి ప్రతి సోమవారం మండల ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. హైమావతి గ్రామాల్లో సర్పంచులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రమేష్, డీఎంహెచ్‌వో సువర్ణ, డీఏవో మల్లయ్య, సీపీవో దశరథ్, ఇరిగేషన్ ఈఈ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కుట్టు మిషన్‌కు దరఖాస్తులు ప్రారంభం

కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు అందించి, ఇంటి వద్దనే ఉపాధి పొందేలా ప్రోత్సహించనున్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి తెలిపారు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 13 వరకు అందుబాటులో ఉంటుందని.అర్హులైన మహిళలు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని జిల్లా అధికారి పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం,
కరీంనగర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
స్వాతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది అని ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!!
మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
స్వాతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!!
నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగిన అంటారు
నా భారతదేశం!!!
రచన :-
దేవులపల్లి రమేశ్,



కలం : వామిక శ్రీ వర్ష,
నంగునూర్, సిద్దిపేట జిల్లా
చరవాణి :-9963701294.

## మన దేశం... మన జెండా

వేకువ జామున వీచే
చల్లగాలులు చేసే సవ్వడి
మన భారతం ఘన భారతం
నవభారతం యువభారతం
ఉదయభానుడి ఉషాకిరణాలలో
మెరిసే అద్భుత దృశ్యం
మదిలో భరతమాత ప్రత్యక్షం
అరుణ వర్ణ కొండల్లో...
శ్వేత వర్ణ సెలయేళ్లలో...
హరిత వర్ణ ప్రకృతిలో...
గోచరించింది త్రివర్ణ పతాకం
పక్షుల కిలకిలరావంలో
కోకిల మధుర గానంలో
వినిపించిన నాదం
భారత జాతీయ గీతం
వందేమాతరమంటూ...
నవ జవానులై కవాతు చేసిన
విద్యార్థుల నోట
ధ్వనించిన నాదం
సమస్త భారతీయుల నినాదం
ఈ స్వాతంత్ర దినోత్సవ వేళ
భారతావనిలో ఆనంద హేళ
వినీల ఆకాశం నిండా



ఎగిరింది జాతీయ జెండా
దేశభక్తి నిండింది
అందరి గుండెలనిండా
విశ్వవిఖ్యాత
మన తిరంగా జెండా
శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు
ప్రతి ఒక్కరికి స్వాతంత్ర
దినోత్సవ శుభాకాంక్షలు

## లలితా త్రిపుర సుందరి హోమంతో ఆధ్యాత్మిక శోభ

**- సింగంపల్లి కాశీ విశ్వనాథ ఆలయంలో వైభవంగా సహస్ర కలువ పూల హోమం**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామంలోని కాశీ విశ్వనాథ ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి హోమ మహోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సహస్ర కలువ పూలతో హోమాన్ని చేపట్టారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య జరిగిన హోమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. లోకకల్యాణం, ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ హోమ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఆహ్వానకర్తగా శ్రీ నాగలక్ష్మి సిద్ధాంతి వ్యవహరించగా, వేదిక నిర్వాహకులుగా శ్రీమాన్ కృష్ణచంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు
పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు భరోసా అందని రైతులు వివరాలు ఇవ్వాలి

**- ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ విజ్ఞప్తి**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండల పరిధిలో పంటలు సాగు చేసినప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పెట్టుబడి సాయం అందని రైతులు తమ వివరాలను అందించాలని ఏఎంసీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. అర్హత ఉన్నప్పటికీ రైతు భరోసా నిధులు అందని రైతులు తమ పూర్తి వివరాలను తనకు పంపించాలని సూచించారు. ముఖ్యంగా పంట సాగు చేసినా రైతు భరోసా అందని రైతులు తమ సమస్యను తెలియజేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తానన్నారు. రైతు భరోసా నిధులు అందకపోవడానికి గల కారణాలను పరిశీలించి, అర్హత కలిగిన రైతులకు సాయం అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. అలాగే రైతులు తమ పంట సాగు వివరాలను స్పష్టంగా అందించి, సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి, రైతు భరోసా అందని వారు తమ వివరాలను అందించాలని తాళ్ల రవీందర్ విజ్ఞప్తి చేశారు.

## రాములు కుటుంబాన్ని పరామర్శించిన కానుగుల జోగయ్య



**వెల్దండ, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**వెల్దండ మండల కేంద్రానికి చెందిన వానరాశి రాములు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కానుగుల జోగయ్య మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పిస్తూ, తన వంతు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జోగయ్య మృతుని కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్, బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము నాగయ్య, సీనియర్ నాయకులు మంగళగిరి సత్యం, యువ నాయకులు జంగిలి ప్రవీణ్, గోపాల్, బిట్టి సైదులు, అలాగే వానరాశి రాములు, శివరాజ్, మహేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమంపై డోర్ టు డోర్ ప్రచారం



**నందికొట్కూరు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు మండలం మల్యాల గ్రామంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల వేడుకలు



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో శ్రావణ మాస బోనాల వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు.వేపాకులు, పసుపు, కుంకుమలతో అలంకరించుకొని తలపై బోనాలను ఎత్తుకొని డప్పు చెప్పుల నాదం మధ్య అమ్మ వారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. బెల్లం అన్నం, పెరుగు అన్నం నైవేద్యంగా సమర్పించి "పాడి పంటలను చల్లగా చూడాలి తల్లీ"
అంటూ భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.

## జోగినపల్లి శ్రీనివాస్‌రావుకు కేసీఆర్ నివాళి



**హైదరాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్‌రావు పార్థివదేహానికి నివాళులర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని ఆయన నివాసానికి చేరుకున్న కేసీఆర్, కుటుంబ సభ్యులను ఓదార్చుతూ "అధైర్యపడొద్దు... అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన వెంట మంత్రి కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌రావు గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.కుటుంబ సభ్యులు, అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కన్నీటి శ్రద్ధాంజలి ఘటించారు.

## వికలాంగుల సంక్షేమ శాఖ నూతన డైరెక్టర్‌ను కలిసిన గుత్తికొండ కిరణ్



**హైదరాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సత్యనారాయణ నియమితులైన సందర్భంగా, రాష్ట్ర వికలాంగుల హక్కుల సాధన సమితి అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా 2016 వికలాంగుల హక్కుల చట్టం అమలు అయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు .కిరణ్ మాట్లాడుతూ, "దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరింత కృషి చేయాలి. చట్టపరమైన హక్కులు వారికి చేరేలా కఠినంగా అమలు జరగాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు యశోద గోదా ఉమారాణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎలిగేడు మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పూర్తి



**ఎలిగేడు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని 12 గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు, సర్పంచులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణ, జాతీయ గీతం ఆలాపనకు కావలసిన ఏర్పాట్లు పూర్తిగా సిద్ధం చేశారు. ప్రతి గ్రామంలో ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.దేశభక్తి, ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించేలా ఈ వేడుకలు వైభవంగా జరగనున్నాయి.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా ఉంటాం

**- విటాయిపల్లి పాఠశాలలో ఏకరూప దుస్తుల పంపిణీ.. కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విటాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులను అందజేసి, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పాండు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ నర్మద, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పంద్రాగస్టు వేడుకలకు ఆమనగల్లు సిద్ధం

**– త్రివర్ణ జెండాలు, టోపీలు, బ్యాడ్జీలు, తోరణాల కొనుగోళ్లతో సందడి**



**ఆమనగల్లు, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆమనగల్లు పట్టణం సిద్ధమైంది. శనివారం నిర్వహించనున్న పంద్రాగస్టు వేడుకల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద త్రివర్ణ పతాకాలు, జాతీయ జెండా రంగులతో అలంకరణలు చేపట్టారు. పట్టణంలోని దుకాణాల్లో త్రివర్ణ జెండాలు, టోపీలు, బ్యాడ్జీలు, మూడు రంగుల తోరణాలు, చిన్నారుల టీషర్టుల కొనుగోళ్లతో సందడి నెలకొంది. చిన్నారులు, యువత జాతీయ జెండా రంగులతో కూడిన వస్తువుల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు చోట్ల మిఠాయిల పంపిణీకి ఏర్పాట్లు చేస్తుండటంతో స్వీట్ల దుకాణాల్లోనూ కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో ఆమనగల్లు పట్టణంలో ఎక్కడ చూసినా జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా పంద్రాగస్టు సందడి నెలకొంది.

## ఉపాధ్యాయుల ఐక్యతతో పీఆర్‌టీయూ టీఎస్ బలోపేతం



**ఆమనగల్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మండలంలోని విఠాయిపల్లి యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పీఆర్‌టీయూ టీఎస్ ఆమనగల్ మండల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఏ. మల్లేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వి. చందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా పి. పద్మ, అసోసియేట్ అధ్యక్షులుగా కే. రవీందర్ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా కే. తనుజ, ఉపాధ్యక్షులుగా ఏ. నట్రాజ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్. మమత, కార్యదర్శిగా డి. మహేందర్ రెడ్డి, మహిళా కార్యదర్శిగా ష. హవార్ ఎన్నికయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎస్. మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే. కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు పి. రాఘవేందర్, కడ్తాల్ మండల అధ్యక్షురాలు పద్మ హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా కిషోర్, నవీన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. సమావేశంలో ఆమనగల్ మండల పీఆర్‌టీయూ టీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## వటవర్లపల్లి పాఠశాలలో పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



**అమ్రాబాద్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల పరిధిలోని వటవర్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ ఉపసర్పంచ్ బండ బాలరాజు సొంత ఖర్చుతో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. సుమారు ?6,000 ఖర్చుతో ప్రతి విద్యార్థికి 3 నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, చాక్ ముక్కలు, రబ్బర్లు, పలకలు, అలాగే వివిధ రకాల ఆటవస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వర్తియావత్ బిచ్చాని, మండల విద్యాధికారి ఎ. బాలకిషన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. అంజిలాల్, ఉపాధ్యాయులు ఎస్. శ్రీలత, శ్రీవాణి, అంగన్వాడీ టీచర్ పార్వతమ్మ, గ్రామ యువజన సంఘ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండల విద్యాధికారి బాలకిషన్ మాట్లాడుతూ, "నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, ఆటవస్తువులు అందించడం మానవత్వాన్ని చాటిన చర్య. ఈ విధంగా దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజిలాల్ కూడా బండ బాలరాజు చేసిన సేవను అభినందిస్తూ, "విద్యార్థుల చదువుకు, పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు" తెలిపారు.

## ఈఎఫ్‌ఎల్‌యూ విద్యార్థులపై ఏబీవీపీ దాడిని తీవ్రంగా ఖండించిన చల్లా వంశీచంద్ రెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో ఎన్ఎస్యూఐ విద్యార్థి నాయకులపై ఏబీవీపీ సభ్యులు చేసిన దాడిని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థుల హక్కుల కోసం గళం వినిపిస్తున్న ఎన్ఎస్యూఐ నాయకులపై కర్రలు, గాజు సీసాలతో దాడి చేయడం అత్యంత దారుణం. పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడటం ఆందోళనకరం" అని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎన్ఎస్యూఐ ఈఎఫ్ఎల్యూ జనరల్ సెక్రటరీ సోహిల్ యాదవ్, జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ సింగ్, హర్ష్ తమ్రాకర్, అధ్యక్షుడు ఆశిష్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు సోను రాజ్తో పాటు పలువురు విద్యార్థులు గాయపడ్డారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులను కులపరమైన దూషణలకు గురిచేయడం మరింత ఆందోళనకరమని అన్నారు. వంశీచంద్ రెడ్డి గాయపడిన విద్యార్థులను సీసీ ష్రాఫ్ మెమోరియల్ ఆసుపత్రిలో పరామర్శించి, వారికి సంఘీభావం తెలియజేశారు. "విద్యార్థుల ప్రజాస్వామ్య గొంతుకను హింసతో ఎవరూ అణిచివేయలేరు. ఎన్ఎస్యూఐ నాయకుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది" అని స్పష్టం చేశారు. ఏబీవీపీ ప్రదర్శిస్తున్న హింస, బెదిరింపులు ఆర్ఎస్ఎస్ ప్రోత్సహిస్తున్న విభజన రాజకీయాలకు ప్రతిబింబమని ఆయన విమర్శించారు. అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రాజ్యాంగ ప్రాథమికాంశాలను సిలబస్‌లో చేర్చాలని లార్డ్స్ సొసైటీ డిమాండ్



**కల్వకుర్తి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా విద్యా ప్రణాళికలో మార్పులు చేయాలని లార్డ్స్ సొసైటీ డిమాండ్ చేసింది. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి. అబ్రహం రోస్ నేతృత్వంలో ప్రతినిధులు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మానవ హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం పట్ల విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించడం అత్యంత అవసరం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ పౌరులందరికీ దిక్సూచి" అని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, మౌలిక అంశాలను పాఠశాల విద్యా వ్యవస్థలో భాగం చేయాలని సొసైటీ ప్రతినిధులు కోరారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని వారు అభిప్రాయ పడ్డారు. జిల్లా కలెక్టర్ ఈ వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యా ప్రణాళికలో రాజ్యాంగ మౌలికాంశాలను చేర్చేలా చర్యలు తీసుకోవాలని సొసైటీ విజ్ఞప్తి చేసింది.

## శ్రీశ్రీశ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి గుడిలో దివ్య దర్శనం



**కల్వకుర్తి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్ర యాగాలు 15 రోజులపాటు కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర సందర్భంలో శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామివారు విచ్చేయనున్నారని ఆలయ ట్రస్ట్ ఫౌండర్ కల్వ మనోహర్ తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు స్వామివారు ఆలయానికి విచ్చేసి, భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు. ఆయన ఆధ్యాత్మిక అనుగ్రహ వాక్కులను ఆలకించి, పరమపావనమైన ఆశీస్సులు పొందేందుకు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయాలని ట్రస్ట్ ఫౌండర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక శాంతి, దైవానుగ్రహం పొందే అవకాశం లభించనుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా రమాకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కల్వకుర్తి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు రమాకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చేత కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు.

## తలకొండపల్లి రక్తదాన శిబిరం విజయవంతం



**కల్వకుర్తి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమన్గల్ ఆధ్వర్యంలో, కాసు సీతమ్మ ద్వాదశ దినం సందర్భంగా తలకొండపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమానికి క్యాంపు చైర్మన్ పి. అంజిరెడ్డి, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే మహత్తర సేవలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం సమాజానికి ఆదర్శప్రాయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో అమనగల్‌లో పోలీసుల నిఘా

**– బస్టాండ్ పరిసరాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు.. అనుమానితులపై ప్రత్యేక దృష్టి**



**అమనగల్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో అమనగల్ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీపీ, ఫ్యూచర్ సిటీ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం అమనగల్ బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌తో పాటు సర్ప్రైజ్ వెహికల్ చెకింగ్ నిర్వహించారు. బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆరా తీశారు. బస్టాండ్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాపిలాన్ చెకింగ్ చేపట్టారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా గుర్తుతెలియని వస్తువులు కనిపిస్తే ప్రజలు వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని అమనగల్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు సూచించారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకుల కోసం వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని పూజించి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, శాంతి, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. కార్యక్రమాన్ని విభాగ ఇన్‌చార్జి డా. బి. రజని దేవి సమన్వయం చేసి, మహిళా అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం ప్రసాదం పంపిణీ చేసి, భక్తి, ఆనందం, ఆత్మీయతల మధ్య విజయవంతంగా ముగించారు.

## ప్రియ మిల్క్ పార్లర్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్



**కరీంనగర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలోని కోతి రాంపూర్ ప్రాంతం పోచమ్మవాడలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ మల్లికార్జున ప్రియ మిల్క్ కంపెనీ పార్లర్‌ను ఘనంగా ప్రారంభించారు. ప్రియ మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పార్లర్‌ను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులు అందుబాటులోకి రావడం సంతోషకరమని, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించడంలో, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఇటువంటి సంస్థల పాత్ర కీలకమని అన్నారు. ప్రారంభోత్సవంలో 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, 37వ డివిజన్ కార్పొరేటర్ కె. ఏపీపీ చంద్ర (టింకు), సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్, బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో కొత్త రేషన్ షాప్‌ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం జెండా చౌరస్తాలో కల్యాణమస్తు షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం అందజేస్తున్నామని అన్నారు. ఆషాఢ మాస బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం పండుగకు ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఐసీటీ బోధనలో రాష్ట్రస్థాయి శిక్షకుడిగా ఫరాజ్ అబ్దుల్ కరీమ్



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల మాస్కాపూర్ స్కూల్ అసిస్టెంట్ (గణితం) సయ్యద్ ఫరాజ్ అబ్దుల్ కరీమ్ రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా సేవలందించారు. ఆగస్టు 11 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని డా. ఎం.సి.ఆర్. హెచ్.ఆర్.డి. ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన నాలుగు రోజుల శిక్షణలో నూతనంగా నియమితులైన ఐసిటి ఇన్‌స్ట్రక్టర్లకు డిజిటల్ లెర్నింగ్, ఐసిటి ఆధారిత బోధనపై శిక్షణ ఇచ్చారు. ఫరాజ్ అబ్దుల్ కరీమ్ అందించిన సేవలను గుర్తిస్తూ సర్టిఫికేట్ ఆఫ్ అప్రిసియేషన్ అందజేశారు. సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వి. శ్రీహరి, డిఎస్సి ఓ ఎస్పిడీ డా. నవీన్ నికోలస్ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న, ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి శిక్షకుడిగా సేవలందించడం ద్వారా మస్కాపూర్ పాఠశాలకు, నిర్మల్ జిల్లాకు గౌరవం తీసుకువచ్చారని పలువురు అభినందించారు.

## కాగితపు త్రివర్ణ టోపీలతో విద్యార్థుల దేశభక్తి చాటింపు



**ఖానాపూర్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జెడ్పీహెచ్ఎస్ మస్కాపూర్ పాఠశాలలో విద్యార్థులు జాతీయ స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో కాగితంతో త్రివర్ణ టోపీలను తయారు చేశారు. తెలుగు అసిస్టెంట్ వెన్నం అంజయ్య స్వయంగా ఖర్చు చేసి వస్తువులు సమకూర్చి, 7వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ జెండాల వాడకం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని కాగితంతో టోపీలు తయారు చేయడం పర్యావరణ అనుకూలమని, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రయోగాన్ని ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులలో పర్యావరణ స్పృహ, సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

RNI - TELTEL/2023/87644

నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక




# సర్ నోటీసులకు ఈ 12 ధ్రువపత్రాలే సమాధానం - 1987 తర్వాత పుడితే తల్లిదండ్రులవీ చూపాల్సిందే

**హైదరాబాద్ :** మా పేరు ఓటరు లిస్టులో ఉంటుందా? ఒకవేళ ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) నోటీసులు వస్తే ఏం చేయాలి? అసలు ఓటు లేకుండా పోతుందా? ఏ సర్టిఫికెట్ చూపాలి? ఎన్యూమరేషన్ ఫారం సరిగ్గా నింపలేదని నోటీసు వస్తే ఏం చేయాలి? ఇలా చాలా మంది ఓటర్లలో చాలా వరకు సందేహాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2.64 కోట్ల పత్రాలకు (78.30 శాతం) డిజిటలైజేషన్ ప్రక్రియ జరిగింది. ఓట్లు తేడాలున్న జాబితా (అనామలీస్)లో ఉన్న ఓటర్లే 60 లక్షల మంది వరకు ఉన్నారు. ఎస్ఐఆర్-2002తో మ్యాపింగ్ అయి : వీరందరికీ నోటీసులు ఇవ్వడానికి ఎన్నికల సంఘం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17న రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారులు ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించనున్నారు. ఆ రోజు ఎస్ఐఆర్-2002తో మ్యాపింగ్ అయి, సరిగా ఉన్న ఓటర్లు, నోటీసులు అందుకునే ఓటర్ల వివరాలు కచ్చితంగా తెలుస్తాయి. నోటీసులు వచ్చిన వారు కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 12 ఐడెంటిటీ కార్డుల్లో ఒకటి ఈఆర్వో ముందు హాజరై తప్పకుండా చూపించాలి. అప్పుడే ఓటు హక్కును కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఈఆర్వోకు చూపించాల్సిన 12 ధ్రువపత్రాలు ఇవే :



1) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూ ఉద్యోగులు లేదా పెన్షనర్లకు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు(పీపీవో)
2) 01-07-1987 ముందు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, ఎల్ఐసీ, స్థానిక సంస్థలు జారీ చేసిన గుర్తింపు
3) ప్రభుత్వం నిర్దేశించిన అధికారితో జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్
4) విదేశాంగ శాఖ జారీ చేసిన పాస్‌పోర్టు
5) గుర్తింపు పొందిన బోర్డులు, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్ (ఎస్?ఎస్?సీ) లేదా ఇతర విద్యార్హత పత్రాలు
6) సంబంధిత అధికారి జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం
7) అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం
8) క్యాస్ట్ సర్టిఫికెట్
9) జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) (ఎక్కడైనా అమలులో ఉంటే)
10) రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు జారీ చేసిన కుటుంబ రిజిస్టర్ పత్రం
11) ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా భూమి, ఇంటి కేటాయింపు ధ్రువీకరణ పత్రం
12) ఆధార్ కార్డు (కమిషన్ నిర్దేశించిన నిబంధనలు వర్తిస్తాయి)

ఏ వయసు వారు ఏం చూపాలి..1987 జులై 1వ తేదీ కంటే ముందు జన్మించిన వారు 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలి. 1987 జులై 1 నుంచి 2004 డిసెంబరు 2 మధ్యలో జన్మించిన వారు ఎన్నికల సంఘం పేర్కొన్న వాటిలో ఒక గుర్తింపు కార్డుతో పాటు తల్లిదండ్రుల్లో ఎవరిదైనా ఒకరి ఐడీ కార్డు కూడా చూపాలి. 2004 డిసెంబరు 2 తర్వాత పుట్టిన వారు తన సొంత గుర్తింపు కార్డుతో పాటు తల్లిదండ్రుల ఇద్దరి ఐడీ కార్డులు చూపించాలి.

# ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు.




**హైదరాబాద్:** ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీడీఆర్ జారీ, వినియోగ నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ద్వారా తెలంగాణ బిల్డింగ్ రూల్స్-2012లో సవరణలు చేసింది. దీని ద్వారా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ () పరిధిలో టీడీఆర్ వినియోగానికి మరింత వెసులుబాటు కల్పించినట్లైంది. నూతన జీవో ప్రకారం. ఇకపై, హెచ్ఎండీఏ చేపట్టే ప్రాజెక్టుల కోసం అవసరమైన/స్వాధీనం చేసుకున్న భూములకు ఆ సంస్థే టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ చేయనుంది. పరిధి సహా సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో ప్రజా ప్రయోజన/ప్రాజెక్టుల కోసం ఇచ్చే భూములకూ ఈ నియమం వర్తించనుంది. హెచ్ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్‌ను ఆ సంస్థ పరిధిలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చు/డిస్పోజ్ చేసుకోవచ్చు. అలాగే టీడీఆర్ జారీ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. అదేవిధంగా టీడీఆర్‌కు సంబంధించిన వివరాలు, లెక్కలు, వినియోగంపై ఏకరీతి విధానాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్/లకు టీడీఆర్ సర్టిఫికెట్ కాపీ అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బిల్డ్ నౌ వ్యవస్థలో టీడీఆర్ ప్రాసెసింగ్, జారీ, అకౌంటింగ్, వినియోగానికి అవసరమైన మార్పులూ చేసింది. గెజిట్‌లో ప్రచురించిన తేదీ నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రంగోలి పోటీలు



**ఆమనగల్, ఆగస్టు 14 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎస్సే రైటింగ్, మెహందీ, రంగోలి పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. రంగోలి పోటీలో మొదటి స్థానంలో ఆయేషా, స్వప్న, అక్షయ, రెండవ స్థానంలో సింధుజ, స్పందన, స్నేహ నిలిచారు. మెహందీ పోటీలో మొదటి స్థానంలో సింధుజ, రెండవ స్థానంలో అక్షయ విజయం సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీపాద శర్వాణి మాట్లాడుతూ, "విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి. లక్ష్యాలను పట్టుదలతో సాధించాలి. కఠినమైన పోటీలు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి. మానసిక, శారీరక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి ఆటోలు, క్యాబ్‌లు బంద్ - ప్రకటించిన కార్మిక సంఘాలు

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వివిధ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సుందరయ్య కళా నిలయంలో రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత రవాణా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో 17 కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. లక్షలాది ఆటో, రిక్షాలతో హైదరాబాద్ దిగ్బంధిస్తాం : ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే, సమ్మెలో భాగంగా ముఖ్యమంత్రి నివాసం, అసెంబ్లీ, ప్రజా భవన్‌లను ముట్టడించే కార్యక్రమాలు చేపడతామని ఐకాస కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. లక్షలాది ఆటో రిక్షాలతో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని ఆయన హెచ్చరించారు. ఆటో, రవాణా రంగాల కార్మికుల కోసం సంక్షేమ మండలిని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా ఆటో మీటర్ ఛార్జీలను పెంచాల్సిన అవసరాన్ని వారు నొక్కి చెప్పారు. ప్రభుత్వం కొత్త యాప్?ను ప్రవేశపెట్టాలి : ఓలా, ఉబర్, ర్యాపిడో స్థానంలో ప్రభుత్వం సొంతంగా కొత్త యాప్‌ను ప్రవేశపెట్టాలని వారు కోరారు. అలాగే ఆటో డ్రైవర్లకు రూ.12,000 ఆర్థిక సహాయం అందించే పథకం అమలుపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గాజుల ముఖేశ గౌడ్, మారయ్య, శ్రీకాంత్, రవిశంకర్, ప్రవీణ్, మల్లేశ్‌గౌడ్ తదితర నాయకులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఆటో, రిక్షా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు సమర్పించేందుకు ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిశామని వారు తెలిపారు. గతంలో జరిగిన ఒక రోజు సమ్మె సమయంలో తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేరలేదని వారు ఆరోపించారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదు : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా నిరవధిక బంద్‌ను తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి (టీఎస్టీయూసీ), శివానంద్ (టీఏఎమ్‌యూ), శ్రీనివాస్ (జీయూటీఎస్?), జామా (జీహెచ్?ఏడీయూ), దయానంద్ (టీటీడబ్ల్యూయూ), కొమురయ్య (టీఏడీయూ) రాజు గౌడ్ (క్యాబ్? యూనియన్?), ఐకాస నేతలు రవికుమార్, సలీం, మజాద్ పాల్గొన్నారు.



# వాహనదారులకు గుడ్‌న్యూస్ - చిన్నచిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు కోర్టుల చుట్టూ తిరగక్కర లేదు!

**హైదరాబాద్ :** నగరానికి చెందిన ఓ యువకుడు రెన్యువల్ చేయని డ్రైవింగ్ లైసెన్స్?తో వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ట్రాఫిక్ అధికారి ఫైన్ వేయగా, గతంలో ఉన్న చలనాలతో కలిపి అతడిపై క్రైం రికార్డు నమోదైంది. నూతన సవరణ చట్టం ప్రకారం- ఇలాంటి ఉల్లంఘనలకు న్యాయస్థానానికి వెళ్లాల్సిన పని ఉండదు. క్రిమినల్ నేరంగా దీనిని పరిగణించరు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో కేసుల పరంగా ఎదురయ్యే ఇబ్బందులు ఇకపై తొలగనున్నాయి. కేంద్రం రూపొందించిన జన్? విశ్వాస్ సవరణ చట్టం -2026 ఈనెల 15వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. మోటర్ వెహికల్ యాక్టులో తీసుకొచ్చిన కీలక మార్పులు ప్రభావం చూపనున్నట్లుగా తెలుస్తోంది. నూతన మార్పులు, నిబంధనలపై రవాణా, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బందికి సరైన అవగాహన అవసరం అనే అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతోంది. సానుకూలతలు :కేసులు సత్వరంగా పరిష్కారమయ్యే అవకాశం : చిన్నపాటి ట్రాఫిక్ ఉల్లంఘనలు, సాంకేతిక లోపాలపై న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఈ-చలానాలు, జరిమానాలు డిజిటల్ వేదికల్లో నేరుగా చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల కేసులు మరింత వేగంగా పరిష్కారం అవుతాయని రవాణా శాఖ అధికారి అన్నారు. క్రిమినల్ ముద్ర నుంచి రక్షణ : వాహన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ ఆలస్యం వంటివాటిని కొత్త చట్టం కింద నేరంగా పరిగణించరు. ఇలాంటి వెసులుబాట్లు ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్న యువత, ఇతర డ్రైవర్లకు ఉపశమనం కలిగిస్తాయని నగరానికి చెందిన న్యాయవాది ఒకరు అభిప్రాయపడ్డారు. వ్యాపార, రవాణా రంగానికి ఊరట : వాణిజ్య వాహన రవాణా నిబంధనలు మరింత సరళతరం కానున్నట్లుగా తెలుస్తోంది. కొత్త నిబంధనలతో చిక్కులు తగ్గి సరుకు రవాణా మరింత సులభతరం అవుతుందని ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు, లారీల యజమానులు చెబుతున్నారు. అమల్లో ఉన్న సవాళ్లు :అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశం: కోర్టుల ప్రమేయం లేకుండా కార్యనిర్వాహక అధికారులే ఫైన్(జరిమానా)) విధించడం వల్ల అవినీతి లేదా అధికార దుర్వినియోగానికి దారితీసే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. రహదారి భద్రతపై ప్రభావం : అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలను నడిపే నేరాల విషయంలో కఠిన వైఖరి కొనసాగనట్లయితే రోడ్డు భద్రతకు విఘాతమేర్పడుతుంది. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు మరింత పెరిగే ప్రమాదముందని రవాణాశాఖ అధికారులు భావిస్తున్నట్లుగా సమాచారం. బాధితుల హక్కుల పరిరక్షణ : రోడ్డు ప్రమాద బాధితుల హక్కులు, మోటార్ యాక్సిడెంట్స్ భంగం కలగకుండా ఉండే విధంగా కొత్త నిబంధనల అమలు జరగాలనే అభిప్రాయం ఉంది.



# నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోంది: డీజీపీ ఆనంద్



**హైదరాబాద్, ఆగస్టు 14 :** నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఈరోజు (శుక్రవారం) నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారుసురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# సీఎం డైరెక్షన్‌తోనే భూముల నిషేధం'.. ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, ఆగస్టు 14:**

తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్న చోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.



# శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దు

**• శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా**




శ్రీలంకలోని గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఆగస్టు 15 నుంచి భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్? ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు టెస్ట్ సిరీస్ ఆడేందుకు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీమిండియాను హెచ్చరించారు. ఆతిథ్య శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దని.. ఈ సిరీస్ టీమిండియాకు అంత సులభంగా ఉండబోదని స్పష్టం చేశారు. భారత్, శ్రీలంక జట్లు చివరిసారిగా 2022లో బెంగళూరులో డే-నైట్ టెస్టులో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా 238 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత ఈ రెండు జట్లు సుదీర్ఘ కాలం పాటు టెస్టుల్లో ఎదురు పడలేదు. ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పరంగా ఈ సిరీస్ అత్యంత కీలకమైనదని.. ప్రస్తుతం స్టాండింగ్స్ లో మెరుగైన స్థానంలో ఉన్న శ్రీలంక భారత్ కు గట్టి పోటీనిస్తుందని ధనంజయ డి సిల్వా ధీమా వ్యక్తం చేశారు. సాధారణంగా గాలే స్టేడియం పిచ్ స్పిన్నర్లకు విపరీతంగా సహకరిస్తుందనే పేరుంది. అయితే ఈ సారి పిచ్ పరిస్థితులు భిన్నంగా ఉంటాయని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా గ్రౌండ్ సిబ్బంది పూర్తి స్థాయిలో పిచ్ ను సిద్ధం చేయలేకపోయినప్పటికీ.. ఈ వికెట్ బ్యాటర్లకు బాగా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు. ఇరు జట్ల బ్యాటర్లకు మంచి పరుగులు సాధించే అవకాశం ఉంటుందని డి సిల్వా అభిప్రాయపడ్డారు. గాయపడిన కుశాల్ మెండిస్ స్థానంలో సీనియర్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లాను జట్టులోకి తీసుకోవడంపై డి సిల్వా వివరణ ఇచ్చారు. 'గాలే స్టేడియంలో వికెట్ కీపింగ్ చేయడం చాలా సవాలుతో కూడుకున్నది. అందుకే టాలెంటెడ్ వికెట్ కీపర్ అవసరం ఏర్పడింది" అని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. అలాగే ఈ మ్యాచ్ ద్వారా యువ ఆఫ్ స్పిన్నర్ కేశర నువంత టెస్టుల్లోకి అరంగేట్రం చేసే అవకాశం ఉందని తెలిపారు.

# తొలి టెస్ట్‌కు భారీ అడ్డంకి!



భారత టెస్ట్ టీమ్ చారిత్రాత్మక మ్యాచ్‌కు సిద్ధమైంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం గాలే వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. ఇది టెస్ట్‌ల్లో టీమిండియాకు 600వ మ్యాచ్ కావడం విశేషం. స్వాతంత్ర్యదినోత్సవం నాడే ఈ మ్యాచ్ ప్రారంభమవుతుండటం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ దక్కాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా క్లీన్ స్వీప్ చేయాలి. దాంతోనే విజయమే లక్ష్యంగా శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగుతోంది. శ్రీలంక కండిషన్స్‌కు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే అక్కడికి వెళ్లి సన్నదమైంది. వామప్ మ్యాచ్ కూడా ఆడి గెలిచింది. అయితే తొలి టెస్ట్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే వర్షం కారణంగా గాలే వేదికగా టీమిండియా సన్నాహకాలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం కూడా టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌కు వర్షం అడ్డంకిగా మారింది. తొలి టెస్ట్ జరిగే ఐదు రోజుల పాటు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం గాలేలో వాతావరణం మేఘావృతమై, చల్లని గాలులు వీచడంతో పాటు చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. కాబట్టి మ్యాచ్ కాస్త ఆలస్యంగా ప్రారంభం కావచ్చు. ఉష్ణోగ్రతలు 30-31లీజ మధ్య ఉండే అవకాశం ఉండగా.. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతతో ఆటగాళ్లు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అక్యూవెదర్ రిపోర్ట్ ప్రకారం.. శనివారం ఉదయం 90 శాతం వర్షం పడే అవకాశం ఉంది. 5.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. గంటకు సుమారు 20-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. రెండో రోజైన ఆదివారంతో పాటు తర్వాతి సోమవారం, మంగళవారం, బుధవారాల్లో కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. దాంతో మ్యాచ్‌కు పదే పదే అంతరాయం ఏర్పడవచ్చు. 2017లో చివరిసారిగా శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమిండియా.. కోహ్లీ సారథ్యంలో 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. గాలేలో చివరిసారిగా జరిగిన టెస్ట్‌లో టీమిండియా 304 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.

# తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది

**టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్**




స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా టీమిండియా ఆడే 600వ టెస్ట్ మ్యాచ్‌కు నాయకత్వం వహించడం చాలా గర్వంగా ఉందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2027 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని చెప్పాడు. తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారిందన్నాడు. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భాగంగా శ్రీలంక పర్యటనలో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. రేపు( శనివారం) గాలే అంతర్జాతీయ మైదానంలో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇది భారత్‌కు 600వ టెస్ట్ మ్యాచ్. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఈ మ్యాచ్ జరుగుతుండటం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సిరీస్‌కు టీమిండియా అన్ని విధాల సిద్ధమైంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శుభ్‌మన్ గిల్ పాల్గొన్నాడు. సిరీస్ గెలిచి డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ రేసులో నిలవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. 'కెప్టెన్సీ బాధ్యతల్లో నేను చాలా సౌకర్యంగా ఉన్నా. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కాలంటే.. కనీసం మేం ఏడు టెస్ట్‌ల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి ఫ్రెష్‌గా మెదలుపెడుతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం నాడే భారత్ 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి చారిత్రాత్మక పోరుకు సారథ్యం వహించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఆటగాళ్లకు కాస్త సమయం ఇవ్వాలి. కొందరికీ కాస్త ఎక్కువ సమయం పడుతుంది.

అయినా సరే వారికి అండగా ఉంటాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ మెరుగ్గా రాణించాడు. కానీ అతను గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చింది. బీసీసీఐ సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్ మధ్య ఎలాంటి గ్యాప్ లేదు. మేం కోరుకున్నంత వేగంగా సాయి సుదర్శన్ కోలుకోలేకపోయాడు. అయితే మా జట్టులోని 15 మంది ఆటగాళ్లపై మాకు నమ్మకం ఉంది. తుది జట్టును ఇంకా ఖరారు చేయలేదు. పేసర్ల ఎంపిక తలనొప్పిగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. బౌన్స్‌ను కూడా రాబడతాడు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ వామప్ మ్యాచ్‌లో కూడా సత్తా చాటాడు. సిరాజ్‌తో పాటు రెండో పేసర్ ఎవరా? అనేది తేల్చుకోలేకపోతున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది జట్టును ఎంపిక చేస్తాం.'అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.



# సర్ఫరాజ్ స్పిన్‌ను సమర్థవంతంగా ఆడగలడు

**• టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్**

శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతలపై మేనేజ్‌మెంట్ స్పష్టతనిస్తే ఉప ఖండపు రారాజుగా ఎదుగుతాడని తెలిపాడు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడగలడని అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం(ఆగస్ట్ 15) నుంచి గాలే ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా తొలి టెస్ట్ మొదలవ్వనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్‌పై ఆశలు సజీవంగా ఉండాలంటే.. ఈ సిరీస్ గెలవడం టీమిండియాకు కీలకం. అయితే భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో జట్టుకు దూరమయ్యారు. సాయి సుదర్శన్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన అశ్విన్.. సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతల గురించి క్లారిటీ ఇవ్వాలని మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. 'సాయి సుదర్శన్ గాయంతో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. సర్ఫరాజ్‌కు జట్టులో తన పాత్రపై క్లారిటీ ఇవ్వాలి. కొన్ని కండిషన్స్‌లో అతని సామర్థ్యంపై సందేహం ఉంటే ఆ విషయాన్ని అతనికి చెప్పాలి. ఉపఖండం కండిషన్స్‌లోనే నువ్వు రాణించగలవు, అప్పుడే నీకు అవకాశం ఇస్తామని చెప్పాలి. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోడు. మంచి స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలో మరింత ఫోకస్ పెడుతాడు. ఉంపఖండపు పరిస్థితుల్లో రారాజుగా మారుతాడు. తన కెరీర్‌ను నిర్మించుకుంటాడు. స్పిన్ కాకుండా ఇతర కండీషన్స్‌లో అతను రాణించలేడని భావిస్తే.. ఆ విషయాన్ని అతనికి చెప్పాలి.'అని అశ్విన్ సూచించాడు. అయితే తుది జట్టులో సర్ఫరాజ్ ఖాన్‌కు బదులు ముందుగా ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. గాలె స్టేడియం స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ క్రమంలోనే ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్‌ను సమర్థవంతంగా ఆడగలడని పేర్కొంటున్నారు. మరోవైపు ధ్రువ్ జురెల్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం దక్కుతుందా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# జెమిమా రోడ్రిగ్స్‌కు గాయం..




ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ ఇంజ్యూరీ కారణంగా రాబోయే రెండు బిగ్ టోర్నమెంట్లకు దూరమైంది. ఇంగ్లాండ్ లో జరిగిన 'ద హండ్రెడ్' లీగ్ లో ఆడుతున్న సమయంలో హామ్‌స్ట్రింగ్ గాయం వల్ల ఆమె రాబోయే ఉమెన్స్ ఆసియా కప్ తో పాటు ఏషియన్ గేమ్స్ నుంచి కంప్లీట్ గా రూల్ అవుట్ అయింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (సీఓఈ) మెడికల్ టీమ్ ఆమెను పరిశీలించి, గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో రెస్ట్ అవసరమని తెలిపినట్లు బిసిసిఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. "ఆగస్టు 3న ఇంగ్లాండ్ లో 'ద హండ్రెడ్' మ్యాచ్ ఆడుతుండగా జెమిమా కుడి తొడ కండరాల గాయానికి గురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో బిసిసిఐ మెడికల్ టీమ్ ఆమెకు క్లినికల్ టెస్టులు నిర్వహించింది. ఈ టెస్టుల్లో ఆమెకు హై-గ్రేడ్ టియర్ ఉన్నట్లు తేలింది" అని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో యూఏఈ వేదికగా జరగబోయే ఆసియా కప్, జపాన్ లో జరగబోయే ఏషియన్ గేమ్స్ కు జెమిమా దూరమవ్వక తప్పలేదు. 25 ఏళ్ల జెమిమా స్థానంలో ప్రతీక రావల్ ను ఉమెన్స్ సెలెక్షన్ కమిటీ రీప్లేస్‌మెంట్ గా ఎంపిక చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ వేదికగా ఏసీసీ ఉమెన్స్ ఆసియా కప్ జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ లోని ఐచి-నగోయా వేదికగా ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. కీలకమైన ఈ రెండు టోర్నీలకు ముందు స్టార్ బ్యాటర్ దూరం కావడం భారత జట్టుకు బిగ్ షాక్ అనే చెప్పాలి. జెమిమా రోడ్రిగ్స్ స్థానంలో ప్రతీక రావల్ ఎంట్రీతో బిసిసిఐ అప్‌డేటెడ్ స్క్వాడ్ ను రిలీజ్ చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్ గా టీమ్ ను లీడ్ చేయనున్నారు. జట్టులో షెఫాలీ వర్మ, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, ప్రతీక రావల్ ఉన్నారు.



# బ్లాక్‌హాక్స్ జట్టులో నలుగురు తెలుగోళ్లు

## - గోవా గార్డియన్స్ ట్రోఫీలో శుభారంభం

**గోవా:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు ఇటీవల విజయవాడలో నిర్వహించిన అండర్-21 ట్రయల్స్‌లో ప్రతిభావంతులైన తెలుగు నలుగురు తెలుగు క్రీడాకారులకు జట్టులోకి తీసుకుంది. కార్తిక్ ( గుంటూరు), ధీమన్ ( వైజాగ్), స్రునిక్ (పెద్దపల్లి), అక్షిత్ ( వరంగల్ ) బ్లాక్‌హాక్స్ జట్టులో నిలిచారు. గోవా వేదికగా శుక్రవారం ప్రారంభమైన అండర్-21 గోవా గార్డియన్స్ ట్రోఫీలో బ్లాక్ హాక్స్ జట్టు శుభారంభం చేసింది. బెంగళూరుపై హైదరాబాద్ 3-0తో నెగ్గింది. హైదరాబాద్ 15-8, 15-13, 16-14తో హ్యాట్రిక్ సెట్లలో నెగ్గి, విజయం సాధించింది. ఈ ట్రోఫీలో బ్లాక్ హాక్స్ సహా పీవీఎల్‌లోని పది జట్లు పోటీ పడుతున్నాయి.

శనివారం,
ఆగస్టు 15, 2026

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# ఓ కుటుంబ కథా చిత్రమ్...
## విశ్వనాథ్ అండ్ సన్స్



కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా?


సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# అతీంద్రియ శక్తుల
# హార్రర్ స్టోరీ అగధ





ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని

అందుకుందీ చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగధ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగధ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగధ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.




# టాక్సిక్ కోసం కియారా చాలా కష్టపడింది
## నటుడు యశ్ ప్రశంసలు




సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి'
### గా విక్టరీ వెంకటేశ్.. పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌తో అంచనాలు డబుల్!




విక్టరీ వెంకటేశ్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదవ సినిమాపై నెలకొన్న అంచనాలను మరింత పెంచుతూ, చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులకు కానుకగా రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌లో వెంకటేశ్ పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్ 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. కౌంటర్ టెర్రరిజం, బందీలను విడిపించడంలో నిపుణుడైన సైనికాధికారిగా ఆయన పాత్ర ఉండబోతోందని ఫస్ట్ లుక్ స్పష్టం చేస్తోంది. 1986లో 'కలియుగ పాండవులు' చిత్రంతో అరంగేట్రం చేసిన వెంకటేశ్, సినీ పరిశ్రమలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంలో ఈ పోస్టర్‌ను విడుదల చేయడం విశేషం. ఇప్పటికే ఫ్2, ఫ్3, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు.. వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబోలో ఇది ఐదో సినిమా కావడంతో ప్రేక్షకులు, ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నందమూరి కల్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటం అదనపు ఆకర్షణ. వీరి సరసన హీరోయిన్లుగా కీర్తి సురేశ్, కృతి శెట్టి నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, అనుకున్న సమయానికే చిత్రాన్ని పూర్తి చేయాలని చిత్రబృందం భావిస్తోంది. హిట్ కాంబినేషన్, భారీ తారాగణం, పండుగ సీజన్ విడుదల వంటి అంశాలతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్




టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.